

సాంప్రదాయంలోని చెడును తిరస్కరిస్తూ,
జీవితంలో ప్రధానమైన విలువలు,
నీతి నియమాలుండాలంటూ, ఆదర్శప్రాయం,
నియమబద్ధమైన జీవితం గడిపినారు మా మాస్టారు.

# జగమెరిగిన ఒజ్జ

**శ్రీ చిగురుపాటి అమరయ్య, నిడుబ్రోలు**

మా ఆచార్యవర్యులు శ్రీ ఎలవర్తి రోశయ్యగారు జగమెరిగిన, జందెము లేని బ్రాహ్మణులు. విధినిర్వహణలో, పాండిత్యంలో, ఆంగ్ల భాషోచ్చారణలో, విద్యాబోధనలో తలమానికమైన ఒజ్జ. గుంటూరు సీమకు ఘనకీర్తి గడించిన వీరు, వీరి సమకాలికులైన ఆంగ్ల భాషోపన్యాసకులు శ్రీ వి. సుబ్బారావుగారు, శ్రీ వై.ఏస్.ఆర్. చంద్రన్‌గారు, డ్కాక్టరు థామస్‌గారు, డ్కాక్టరు ఎస్. అనంతంగారు, డ్కాక్టరు అమరేంద్రగారు, శ్రీ టి.వి.జి. కృష్ణమూర్తిగారు ఈ సందర్భంలో స్మరణీయులు.

## కర్తవ్య పరాయణుడు

విధి నిర్వహణ ఎలా చేయాలనేది శ్రీ రోశయ్యగారిని చూచి నేర్చుకోవాలి. ఉపాధ్యాయుడుగా ఆయన ఎక్కువ కాలం ఏ.సి.కాలేజీలో గడిపారు. ఆయన సెలవు పెట్టినట్లు ఎవరికీ తెలియదు. ''స్టాఫ్ ఆన్ లీవ్'' అని కాలేజి ఆఫీసు బయట గోడపై ఉంటుంది. సెలవులో ఉన్న లెక్చరర్ల పేర్లు రోజూ ఆ బోర్డుపై వ్రాయిస్తారు. విద్యార్థులు అది చూచి, ఆ క్లాసులకు వెళ్ళకుండా, లైబ్రరీకి వెళ్ళి చదువుకోవాలి.

రోశయ్యగారి పేరు ఆ బోర్డుమీద ఉంటుందేమోనని చాల మంది విద్యార్థులు వెతికేవారు. ఏనాడూ కానరాదు: ఆయన సెలవు పెట్టరు. ఆయన పేరెపుడూ బోర్డుమీద ఉండదని, విద్యార్థులందరు ఎంతో ఆశ్చర్యంగా, మెప్పుగా చెప్పుకొనేవారు. ఆయన సుఖాశికాదు. ''ఆరామ్ హరామ్'' అనే తత్వంగలవారు. ఆయన ఆరోగ్యం అంత మంచిది. కర్తవ్యపాలన అంత నిష్ఠతో కూడినది.

నిత్య జీవితంలో నిర్వహించే విధులలో గూడ ఆయన చిన్నపని, పెద్దపని, ఆడపని, మగపని అనే వ్యత్యాసం పాటించరు. స్వయంగా కూరగాయలు, కిరాణా సరుకులు తెచ్చేవారు. ఆయా వస్తువుల మంచి చెడులు ఆయన వివరిస్తుంటే వినేవారు విస్తుపోవలసిందే. వంటచేయుట మగ పిల్లలుగూడా నేర్చుకోవాలి, తప్పుఏమి లేదని చెప్పేవారు.

## సంస్కరణాభిలాషి

శ్రీ రోశయ్యగారి సంస్కరణ ప్రియత్వం మిక్కిలి అపూర్వమైంది. మానవత్వానికి, మానవ పురోభివృద్ధికి ప్రతిబంధకాలైనవన్నీ మారాలంటారు. మార్పు మంచికోసమేగాని, నవ్యతకోసం కాదంటారు.

కుల మత వ్యవస్థలు ఆయనకు గిట్టవు. కావుననే అస్పృశ్యతను అంత మొందించాలన్న గాంధీజీ సంస్కరణ ఉద్యమాన్ని సమర్థించి, కులవ్యవస్థ మంచిదే నన్న ఆయన ధోరణిని వ్యతిరేకిస్తారు.

రామాయణ మహాభారతాలను ఉత్తమ కావ్యాలుగా మెచ్చుకొంటారు గాని, పవిత్ర గ్రంథాలనే భావాన్ని ఆయన తిరస్కరిస్తారు. ప్రాచీనాంధ్ర కావ్యాలన్నీ ఆమూలాగ్రంగా అధ్యయనం చేశారు. తప్పు ఒప్పరయుటలో వీరి పాండితీ గరిమ అద్వితీయం.

భాష విషయంలో వీరు యథాతథవాది. వ్యావహారిక భాషావాదం వీరికి సుతరామూ నచ్చదు. అందునా శిష్ట వ్యావహారికమంటే మరీ ఒళ్ళుమంట. వ్యావహారికం పేర భ్రష్టమైన శబ్ద, క్రియారూపాలు

వ్రాయుట మంచిది కాదంటారు. భాషను కట్టుబాట్లు త్రెంచిన ఫలితంగా బుద్ధి కుశలతతో నేర్పేది, నేర్చుకొనేది ఏమీ లేకుండా పోవుటేగాక, నీతినియమాలు గూడ భ్రష్టమై పోయాయని వీరి బాధ. ''I write I speak'', అను ఒక ఆంగ్ల రచయిత మాటను వ్యవహారిక భాషావాదులు తమకు సమర్థనగా వాడుకొనుట హాస్యాస్పదం. ఎందు కనగా ఈ ఇంగ్లీషు వాక్యం వ్యాకరణబద్ధంగా, దోషరహితంగా ఉన్నది. ఇలా స్పష్టంగా, నిర్దుష్టంగా వ్రాస్తే వీరికి నిరభ్యంతరం. ఇంగ్లండులో ఒక వర్గం మేధావులు సాంఘిక, రాజకీయ, ఆర్థిక సంస్కరణలను ఆహ్వానించి, వ్యావహారిక భాషావాదాన్ని తిరస్కరించారు. అంటే వీరు శ్రీ జార్జి బెర్నార్డ్‌షా భాషావాదానికి వ్యతిరేకులు. ఇట్టి మేధావులు భారత దేశంలో, ఆంధ్రదేశంలో గూడా ఉన్నారు. వీరికోవ శ్రీ రోశయ్యగారిది. శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తిగారు, శ్రీ జి.వి.కృష్ణారావుగారు, శ్రీ రోశయ్యగారు బి.ఏ. విద్యార్థులుగా ఉన్నప్పుడు 1936వ సంవత్సరపు ఏ.సి. కాలేజి మాగజీన్‌లో వ్రాసిన వ్యాసాలున్నవి. అందులో ''వ్యావహారిక భాషావాదం'' లోని లోపాలను ఎత్తి చూపే శ్రీ రోశయ్యగారి వ్యాసం ఉన్నది. దీనిలో వ్యావహారిక భాషావాదుల వాక్యాలు కొన్ని పరీక్షించి, క్రియలువినా అంతా శుద్ధ గ్రాంథికమని నిరూపించి, ఆ క్రియలనుగూడ నియమానుసారంగా ఎందుకు వ్రాయకూడదని ప్రశ్నించారు. ''నాకు మనసాయెనే, నాకు సిగ్గాయెనే'' అను రసవంతమైన తెలుగు సామెతతో వారిని గేలిచేశారు.

## హేతువాది- నీతివాది

స్వాతంత్ర్య సమరకాలంలో మంచి సంస్కరణలన్నింటిని సమర్థించిన ధీర మనీషి, శ్రీ రోశయ్యగారు. రాజకీయభావాలలో రాయిస్ట్. సాంఘిక సంస్కరణలో శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి అనుయాయి. భాష విషయంలో గ్రాంథికవాది. సాంప్రదాయంలోని చెడును తిరస్కరిస్తూ, జీవితంలో ప్రధానమైన విలువలు, నీతి

నియమాలుండాలంటూ, ఆదర్శప్రాయం, నియమబద్ధమైన జీవితం గడిపినారు మా మాస్టారు.

## వారి వాఖ్యలు- విమర్శలు

శ్రీ రోశయ్యగారి వ్యాఖ్యలు, విమర్శలు ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా ఉంటాయి.

వశిష్ఠుడు గొప్ప? విశ్వామిత్రుడు గొప్ప? అన్న ప్రశ్నకు, శూద్రుడై, బ్రహ్మర్షిత్వం పొంది, సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడే గొప్ప అని ఆయన సమాధానం. వీరు వాస్తవ వ్యక్తులా అంటే, కావ్యపాత్రలుగాన, రూఢీగా వాస్తవ పురుషులని చెప్పుట సరిగాదని ఆయన అభిప్రాయం.

గాంధీజీ గుజరాతీ భాషలో వ్రాసిన ఒక వ్యాసంలో కుల వ్యవస్థను సమర్థించారు. డా॥అంబేడ్కర్ ఆ వ్యాసాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ప్రకటించారు. కుల వ్యవస్థ పోవాలనుట కడుపునిండా భోజనం చేసినపుడు వచ్చే భుక్తాయాసంలా ఉంటుంది. కాని కుల వ్యవస్థలో మాత్రం సుఖ విరేచనమైనపుడుండే హాయి ఉంటుందని గాంధీజీ ఆ వ్యాసంలో వ్యాఖ్యానిస్తారు. దీనిపై శ్రీ రోశయ్యగారి విమర్శ: 1) కులవ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మాలను అంగీకరిస్తే, వైశ్యులకు, శూద్రులకు రాజకీయాలలో పాల్గొనే అర్హత లేదు. కావున ఆచరణలో గాంధీజీ కులధర్మాన్ని పాటించలేదు గదా: (2) కుల వ్యవస్థలో సుఖవిరేచన హాయి ఉన్నదనుటలో ప్రయోగించినది నీచోపమ లేక హీనోపమ. పేను తల నాశ్రయించి ఉండునట్లు శివుడు వెండికొండ నాశ్రయించి ఉండునని ఉపమించరాదని ఆయన వివరణ.

ఆంగ్లకవి టెన్నిసన్ పద్యం ''యులిసీజ్'' పై ఆయన వ్యాఖ్య విజ్ఞాన దాయకం. మూర్ఖ ప్రజలు, అనుభవ శూన్యుడైన కుమారుడు. ముసలి భార్యతో విసుగ్గా ఉన్నందున, జ్ఞానార్జనకు దిగంతాలకు వెళతానంటాడు నాయకుడు యులిసీజ్. ఇవి జ్ఞాని అనదగిన మాటలుగావు, అసహ్యమైన భావాలని శ్రీ రోశయ్య గారంటారు.

అన్ని వర్గాలవారు వ్యవసాయ వృత్తిలో ఉన్నారు. కాని, మన పూర్వులు కర్షక వృత్తిని హీనంగా చిత్రించారని ఆయన బాధపడతారు. ''అగ్రికల్చర్ ఈజ్ ది మదర్ ఆఫ్ ఆల్ కల్చర్'' (వ్యవసాయమే సర్వ సంస్కృతికి జనని) అని పాశ్చాత్య పండితులన్నారు. ఈ మాత్రపు సత్య దృష్టి మన కర్మభూమిలోని పండితులకు కరువాయెనని ఆయన వ్యథ.

ఇంగ్లీషు భాషోచ్చారణలో ఆయనకున్న ప్రజ్ఞ చెప్పనలవిగాదు. వెహికల్ (Vehicle) అంటాము. కాని దీనిని ''వీయికిల్'' అనాలి: మ్యారేజ్, క్యారేజ్, విలేజ్ గాదు, మ్యారిజ్, క్యారిజ్, విలిజ్ అనాలి. ఇట్టి ఉదాహరణలు కొల్లలు. ఇంగ్లీషు, తెలుగులో శ్రీ రోశయ్యగారిది ప్రామాణికమైన పాండిత్యం. వారిని లెక్చరర్‌గా గౌరవించిన ఏ.సి. కాలేజి యాజమాన్యం వారు, ప్రిన్సిపల్ హోదాతో ఆదరించిన జె.కె.సి. కళాశాల యాజమాన్యంవారు, ముఖ్యంగా డా॥ కె.సదాశివరావుగారు సర్వదా స్తవనీయులు.




1988, మనుమరాలు బాలచంద్రిక,
మనుమడు కిషన్‌లతో - చికాగోలో